# భగవంతుడు గానలోలుడు, గాన ప్రియుడు

కశ్యపుడు తన సర్వస్వమును దైవార్పితం గావించి ఆనందమును అనుభవిస్తూ వచ్చాడు. ఒకనాడు అతని భార్య అదితి "నాథా! మీరు అన్నింటినీ భగవంతునికి అర్పించారు. రాక్షసుల గర్వాన్ని అణచివేయగల ఒక బిడ్డను మనకు ప్రసాదించవలసిందిగా భగవంతుణ్ణి కోరవచ్చు కదా" అన్నది. వారి ప్రార్థన మేరకు అదితి గర్భమునందు విష్ణువే వామనుడై జన్మించినాడు.

బలిచక్రవర్తి ఎన్నియో యజ్ఞములు చేశాడు. కాని, ఎన్ని యజ్ఞములు చేసినప్పటికీ అతనికి మనశ్శాంతి కుదరలేదు, తృప్తి కలుగలేదు. నూట ఏడు యజ్ఞములు చేసిన తరువాత నూటనెనిమిదవ యజ్ఞముగా విశ్వజిత్ యాగమును తలపెట్టాడు. ఆ సమయంలో విష్ణువు వామనరూపుడై అతనివద్దకు వచ్చాడు. బలిచక్రవర్తి "స్వామీ! మీకేమి కావాలి?" అని అడుగగా వామనుడు "అయ్యా! నాకు మూడడుగుల నేల దానమిస్తే చాలు" అన్నాడు. ఇస్తానని బలి వాగ్దానం చేశాడు. అతని గురువైన శుక్రాచార్యుడు "బలీ! ఇతడు సామాన్యుడు కాడు, చాలా గొప్పవాడు, కశ్యపునికి వరప్రసాదముగా పుట్టినటువంటివాడు. ఇతను సామాన్యమైన బ్రాహ్మణుడని నీవు భావిస్తున్నావు. కాదు, కాదు. ఇతను బ్రహ్మాండమునే పట్టుకునే సామర్థ్యం కలవాడు. కేవలం మూడడుగులు మాత్రమే కాదు, ముల్లోకాలనుకూడా ఆక్రమించగలడు. అట్టివానికి నీవు దానమివ్వటానికి పూనుకోవటం మంచిది కాదు" అని హెచ్చరించాడు. బలిచక్రవర్తి పవిత్ర హృదయుడు. ఒక్కసారి మాట ఇచ్చాడంటే దానిని ఏమాత్రం మరువడు. కనుకనే, అతడు శుక్రాచార్యునితో "గురుదేవా! మాట ఇచ్చి తప్పుటకంటే మరణముండునా? నేను మాట ఇచ్చాను. కాబట్టి, అతను ఏది కోరినా ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇంతేకాదు. నేను చేసిన నూట ఎనిమిది యజ్ఞములనుకూడా అతని పాదాలకే అర్పితం చేస్తాను" అని చెప్పి తాను వామనుని దగ్గరకు పోయి అతని పాదాలు పట్టుకొని, ఆ నూట ఎనిమిది యజ్ఞములను ఒక హారంగా చేసి అతని మెడలో వేశాడు. (స్వామి తమ దివ్యహస్తచాలనముచే ఒక సువర్ణ మణిమాలను సృష్టించి భక్తులకు చూపిస్తూ ఇలా అన్నారు)

ఇందులో ఒక్కొక్క మణి ఒక్కొక్క యజ్ఞమునకు ప్రతీక. నూటెనిమిది యజ్ఞములు ఇవన్నీ. వీటన్నింటినీ వామనునికే అర్పితం గావించాడు. "నాది అనేది ఏదీ లేదు. అంతా దైవానిదే" అని అర్పితం గావించి బలి తన యజ్ఞం పూర్తి చేసుకున్నాడు. వామనుడు పెరిగాడు, పెరిగాడు. బ్రహ్మాండమంతకూడను నిండిపోయాడు. అప్పుడు శుక్రాచార్యుడు "చూచితివా బలిచక్రవర్తీ! ఇతను బ్రహ్మాండమునే ఆక్రమించగలడని నేను ముందే హెచ్చరించాను కదా! నీవు ఇతనిని నమ్మి మోసపోతున్నావు" అన్నాడు. వామనుడనగా చాలా పొట్టివాడు. కాని, తాను ప్రపంచాన్నంతటినీ మించిన వాడుగా రూపొందినాడు. మానవస్థాయికి పరిమితులుంటాయిగాని, దైవము ఎట్టి పరిమితులూ లేనివాడు. దానమును స్వీకరించి వామనుడు బలిచక్రవర్తియొక్క విశాల హృదయాన్ని మెచ్చుకున్నాడు. ఆడినమాట తప్పనివాడు బలిచక్రవర్తి. కాని, ఈ కలియుగములో మాటలు ఇస్తున్నారు; అన్నీ తప్పుతున్నారు. ఆ కాలంలో మాట ఇచ్చి తప్పినటువంటివారు ఎవ్వరూ లేరు.

సృష్టిలో ప్రతి ఒక్కటీ దైవాజ్ఞానుసారమే జరుగుతున్నది

ప్రతి రోజూ ఒక నియమం ప్రకారం సూర్యోదయ సూర్యాస్తమయములు జరుగుతున్నాయి. దీనిని ఎవరు నియమించారు? గగనమందున్న చుక్కలు గగనానికే అలంకారంగా గోచరిస్తున్నాయి. కాని, అవి పగలు మాత్రం కనిపించటం లేదు. దీనికి కారణమేమిటని సైంటిస్టులు ఎన్నియో పరిశోధనలు, పరిశీలనలు చేస్తూ వచ్చారు. పగటిపూట వెలుతురు ఎక్కువగా ఉండటం చేత నక్షత్రాలు కనిపించటం లేదు, అని నిర్ణయం చేశారు. ఇదేవిధముగనే, దివ్యశక్తిని గురించి అనేక రకములుగా ఊహిస్తూ వచ్చారు. సృష్టిలో ప్రతి ఒక్కటీ దైవాజ్ఞ

ప్రకారమే జరుగుతూ వస్తున్నది. భగవంతుడు కూడా తన నియమాలను తాను పాటిస్తాడు.

*క్రమము తప్పక మింట ప్రతి దినంబును భాను*
*దుదయాస్తమయముల నందనేల?*
*గగనంబునకు కాంతి కైసేయు తారలు*
*పగలు మాత్రము దాగు భంగియేల?*
*క్షణమైన విశ్రాంతి గొనక తా పవనుందు*
*జీవకోటుల బ్రోవ వీవనేల?*
*అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది*
*సలిలమై ప్రవహించు చందమేల?*

నదులు ఏవిధంగా వస్తున్నాయి? ఏదో అయిష్టంగానో, బలవంతముచేతనో రావటం లేదు. కిలకిల నవ్వుచు ఎంతయో ఆనందముగా ప్రవహిస్తున్నాయి. ఇదంతయు ప్రజలకు ఆనందమును అందించే నిమిత్తమై జరుగుతున్నది. దీనికి ఎవరు అడ్డు పెట్టగలరు? పంచ భూతములన్నీ పరమాత్మ ఆజ్ఞానుసారమే తమతమ కర్తవ్యాలను తాము సక్రమంగా నిర్వర్తిస్తూ వస్తున్నాయి. భగవంతుని ఆజ్ఞను పురస్కరించుకొనియే అవి పనిచేస్తున్నాయిగాని, తమ స్వశక్తితో పనిచేసేవి కావు. కాని, అమాయకులైన ప్రజలు ఈ సత్యాన్ని గుర్తించుకో లేకపోతున్నారు. ఇంతియేకాదు. చెట్టు కొమ్మలు గాలికి అటూ ఇటూ ఆడుతూ ఒకదానికొకటి రాసుకోవటం వలన అందులో అగ్ని పుట్టి ప్రజ్వరిల్లుతున్నది. కట్టెలో అగ్ని ఉన్నదికాని, దానిని భస్మం చేయటం లేదు. ఈ రహస్యాన్ని ఈనాటి వరకు ఎవ్వరూ కనిపెట్టలేదు.

ఒక రాతిని మరొక రాతితో కొట్టినప్పుడు దానినుండి అగ్ని ఆవిర్భవిస్తుంది. కాని, రాతిలో ఉన్నటువంటి అగ్ని మనకు కనిపిస్తున్నదా? లేదు; గోప్యంగా ఉంటున్నది ఇట్టి రహస్యములు జగత్తులో ఎన్నియో ఉన్నవి. సైంటిస్టులు ఈ రహస్యములను గుర్తించాలని అనేక పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఈ రహస్యములను గుర్తించే నిమిత్తమై కొందరు దైవాన్వేషణ సల్పుతూ వచ్చారు. అయితే దైవాన్వేషణ చేయనక్కర్లేదు. దైవము లేని చోటు లేదు. సర్వత్రా ఉన్న దైవాన్ని గుర్తించటానికి ప్రయత్నించక మానవుడు తాను పుట్టినది కేవలం పొట్టను నింపుకోవటం కోసమని భావిస్తున్నాడు. బిడ్డ పుట్టిన తక్షణమే ఏడుస్తుంది. దీని రహస్యమును ఎవ్వరూ నేటికీ కనిపెట్టలేదు. ఇంత తేనెయో, లేక పాలో నాలుకపై పెట్టినప్పుడు హాయిగా నిద్ర పోతుంది. ఈరీతిగా, మానవుడు తాను పుట్టినప్పటినుండి ఆకలి తీర్చుకోవటానికి ఆరాటపడుతూనే ఉన్నాడు.

*జానెడు పొట్టనింపుకొన చిక్కులు నొందుచు కోటివిద్యలున్*
*పూనిక మీద నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక ఈ*
*మానవజాతి దుఃఖమున మ్రగ్గగనేటికి శ్రీ పరాత్పరున్*
*ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా?*

ఈ జగత్తులో సర్వము కేవలం దైవశక్తిచేతనే సంచరించుచున్నవి. మానవుడు తన స్వశక్తిచేత ఏది కూడను సాధించలేదు. ఈ ప్రపంచంలో అనేక శక్తులుంటున్నవి. ఈ శక్తులను ఎవరో పుట్టించారని కొందరు భావిస్తుంటారు. ఇవి ఒకరు పుట్టించేవి కావు. ఇవి కేవలం ప్రకృతియొక్క శక్తులే! దైవసంకల్పముచేత ఇవి ఆవిర్భవిస్తూ వచ్చాయి.

దీపంలో గోపాలుని దర్శించిన సుగుణ

గోకులంలో ఒక ఆచారం ఉండేది. ప్రతి రోజు సాయంకాలం నందుని ఇంటి ముందు వెలుపలి భాగంలో దీపము పెడితే, ఆదీపము నుండి గోపికలు తమ దీపాలను అంటించుకొని తీసుకువెళ్ళేవారు. షావుకారు

ఇంటినుండి దీపం తీసికొనిపోతే బీదవాళ్ళు కూడా షావుకార్లవుతారని ఆనాటి ప్రజల విశ్వాసం. ఆ గ్రామానికి సుగుణ అనే ఒక క్రొత్త కోడలు వచ్చింది. ఆమె అత్తగారు "నందుని ఇంటికి పోయి దీపం ముట్టించుకొని రా" అని చెప్పింది. సుగుణ నందుని ఇంటికి వెళ్ళి దీపం ముట్టించుకుంటుంటే, ఆ దీపంలో ఆమెకు కృష్ణుడు కనిపించాడు. ఆమె తనను తాను మరచిపోయి ఆ దీపాన్నే చూస్తూ నిలబడింది. తన చేయి కాలి పోతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా ఆనందంగా ఆ దీపంవైపే చూస్తూ ఉంది. దీపం ముట్టించుకోవటానికి వెళ్ళిన ఇతర స్త్రీలు, బాలికలు ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు.

*మన సుగుణకు కనిపెంచెనంట*
*నందుని ఇంట గోపాలుడంట*
*దీపాన కనిపించెనంట....*

అని పాట పాడుకుంటూ వాళ్ళు ఆనందంగా డ్యాన్సు చేయటం ప్రారంభించారు. ఈ పాట విని లోపలినుండి యశోద పరుగెత్తుకొని వచ్చి, సుగుణ చేయిని దీపం నుండి బయటికి లాగి "ఏమమ్మా, దీపం నీ చేయిని కాల్చివేస్తుంటే నీవు గుర్తించుకోవటం లేదే! మా ఇంటికి చెడ్డపేరు తేవాలనుకుంటున్నావా?" అన్నది. సుగుణ అత్తగారు మొదలే పెద్ద కోపిష్టి, ఆమె జరిగిన సంగతి తెలుసుకొని సుగుణ ఇంక ఎన్నడూ యశోద ఇంటికి పోకూడదని శాసించింది.

### ఎవరి ప్రాప్తి వారిది

మధురకు వెళ్ళినటువంటి కృష్ణుడు తిరిగి రాక పోయేసరికి గోపికలు ఎప్పుడు వస్తాడు కృష్ణుడు? అని కన్నులు కాయలు కాచేటట్లు కాచుకొని ఉన్నారు. అలాంటి సమయంలో కొందరు కృష్ణుణ్ణి చూశారు. అయితే కృష్ణుడు యశోదకుగాని, నందునికిగాని కనిపించలేదు. గోపికలందరూ యశోద ఇంటి దగ్గర చేరారు. "కృష్ణుడు వచ్చినాడట. అతనిని మీరు ఎక్కడో దాచిపెట్టారు. ఎక్కడున్నాడో మాకు చూపండి" అని అందరూ గోలచేస్తూ వచ్చారు. కృష్ణుడు అందరికీ కనిపించకుండా కేవలం కొందరికి మాత్రమే ప్రత్యేకంగా కనిపించేవాడు. ఈవిధంగా అనేక అద్భుతములు జరుగుతూ వచ్చాయి.

ఇంతకుముందు మన యూనివర్సిటీ పిల్లవాడు తన ప్రసంగంలో చెప్పాడు – "స్వామి! మీరు ఒక్కతూరైనను నాకు కనిపించకూడదా?" అని అతను ప్రార్థిస్తూ ఉండగా స్వామి అతనికి మాత్రమే కనిపించి, ఇంకెవ్వరికీ కనిపించలేదు. "స్వామి! మీరు నా ఒక్కనికి మాత్రమే కనిపిస్తే ఏం ప్రయోజనం? అందరికీ కనిపించాలి కదా! లేకపోతే నా మాటలు వాళ్ళు నమ్మరు. నన్ను హేళన చేస్తారు" అని వాడు నన్ను ధైర్యంగా అడిగాడు. "లోకులు కాకులు. వారి భావము కొద్దీ వారు బోధిస్తారు. కాని, నీ ప్రాప్తి నీది" అని స్వామి జవాబు చెప్పి వెళ్ళిపోయారు.

### 'చిత్తచోరా యశోదాకె బాల్...'

ఒకనాడు యశోద కృష్ణుని పట్టుకొని "కృష్ణా! నీకు కావసినంత వెన్న మన ఇంటిలో ఉన్నది కదా! కాని, నేను పెట్టినది తినవు. ఇంటిలో ఉన్నది నీకు రుచిగా ఉండదు. గొల్లల ఇళ్లకు పోయి వెన్న దొంగిలించి తింటున్నావు. నీ ఆగడాలు మితిమీరిపోతున్నాయి. నాయనా! ఇది నీకు తగదు" అని చక్కగా మంచి మాటలతో బుజ్జగిస్తూ వచ్చింది.

*పెట్టినది తినవు గొల్లల*
*పట్టులకుం బోయి వెన్న పట్టెడులుగ లో*
*గుట్టున తినెదవు నీతో*
*పుట్టెను రట్టళ్ళు కృష్ణ ....*

“తల్లి ప్రేమతో పెట్టినటువంటి వెన్న నీకు రుచిగాఉండదా? ఇతరుల ఇంటికి పోయి దొంగతనంగా తీసుకున్న వెన్న మాత్రమే నీకు రుచిగా ఉంటుందా?” అని మందలించి ఆమె కృష్ణుణ్ణి రోటికి కట్టివేసింది.

లడ్డూ, మిఠాయి అమ్మే వ్యాపారి తన అంగట్లోనే కూర్చొని ఉంటాడు. ఆ వాసనలన్నీ తన ముక్కుకు సోకుతుంటాయి. మిఠాయిలు కంటికి కనిపిస్తుంటాయి. కాని, వాటిపైన అతనికి ఏ మాత్రము ఇష్టము కలుగదు. ప్రక్క అంగడినుండి బొరుగులను తెప్పించుకొని తాను ఎంతో ఇష్టంగా తింటుంటాడు. నిజంగా ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఇది వర్తిస్తుంది. ఎవరి ఇంటిలో వండిన వంటలు వారికి రుచించవు. పరుల ఇంటి వంటలు మాత్రం మంచి రుచిగా అనిపిస్తాయి. అయితే, కృష్ణుడు పరుల ఇంటి వెన్నను స్వీకరించటానికి కారణం అది కాదు. వెన్న అనగా పరిశుద్ధమైనటువంటి హృదయమే! అట్టి పవిత్ర హృదయము ఎక్కడుంటే అక్కడికి వెళ్ళి దానిని స్వీకరిస్తాడు కృష్ణుడు.

గోపికల హృదయాలు పరిపక్వమైనవి. పరిపక్వమైన హృదయాలు మృదు మధురంగా ఉంటాయి. కనుకనే, వారి హృదయాలను తాను అపహరిస్తూ వచ్చాడు. కాని, ఆ దొంగతనము అనేది మాత్రం కృష్ణునికి చెడ్డపేరును తెప్పించింది. అందరు కూడను కృష్ణుణ్ణి ‘చోరుడు, చోరుడు’ అని పిలుస్తూ వచ్చారు. ఊరకే ఎవరినైనా మనం ‘చోరుడా!’ అని పిలిస్తే వారికి కోపం వస్తుంది. అదే పదమును గానములో చేర్చి ‘చిత్తచోరా!’ అని పాడితే అందరూ తలలూపి ఆనందిస్తారు. గానముతో చేరినప్పుడు అది ఎంతో మధురంగా ఉంటుంది. ప్రేమతో ఏవిధంగా పిలిచినప్పటికీ భగవంతుడునికి అది మధురంగానే ఉంటుంది. లేకపోతే, అందరూ ఎందుకు ‘చిత్తచోరా!’ అని పిలుస్తారు? “చిత్తచోరా యశోదాకె బాల్! నవనీత చోర గోపాల్! గోపాల్ గోపాల్ గోపాల్ గోవర్ధనధర గోపాల్” ఈవిధంగా భావరాగ తాళములతో చేరినటువంటి గానము ఎంత మధురంగా ఉంటుందో మీరే యోచన చేయవచ్చు. అట్టి భావరాగతాళములు లేకుండా ‘ఏయ్ చోరుడా! ఇక్కడికి రా’ అని పిలిస్తే ఎవరికైనా కోపం వచ్చేస్తుంది. త్యాగరాజు మొదలైన భక్తులు భావరాగతాళములతో కూడిన మధురమైన గానమును భగవంతునికి అర్పించి, వారు మధురమైన భావమును పొందినారు. మీరు భగవంతుణ్ణి పొందాలనుకుంటే కేవలం మాటలతో పొందలేరు. భావరాగ తాళములు చేరినప్పుడే అది భగవంతుని హృదయానికి హత్తుకొనిపోతుంది. కనుక, మృదు మధురమైనటువంటి గానముచేత మనం భగవంతుణ్ణి పొందవచ్చును.

## దైవంలో లీనం కావాలంటే గానమే ప్రధానము

వేదములు దివ్యత్వమును గురించి ఎంతగానో వర్ణిస్తూ వచ్చాయి. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములను ఎందరో పఠిస్తూ వచ్చారు. కాని, వారిలో ఒక్కరైనను భగవంతుణ్ణి దర్శించినవారు లేరు. వేదములను పఠించినంతమాత్రమున ఎవ్వరూ భగవంతుణ్ణి పొందలేరు. దీనినే గానములో వినిపించినప్పుడు భగవంతుని ప్రేమను ఎంతగానో అనుభవించవచ్చును. కనుకనే, భగవంతుణ్ణి గానలోలుడు, గాన ప్రియుడు అన్నారు. కనుక, మీరు గానముచేత భగవంతుణ్ణి ప్రార్థించండి. ఐతే “మేము గానము చేయలేము. మరి మా గతి ఏమిటి?” అని కొందరు అడుగవచ్చు. మీకు సంగీతపరిజ్ఞానము లేకపోయినా ఫరవాలేదు. ఏదో ఒక రాగమును పెట్టి భగవంతుణ్ణి ప్రేమతో కీర్తించండి. ప్రత్యేకంగా సంగీతం నేర్చుకోవలసిన పని లేదు. “రామా! నన్ను కాపాడు” అని ఒక పద్యంలో చెబితే అది అంత మధురంగా అనిపించదు. మాటలలో చెబితే కూడా అది అంత మధురంగా ఉండదు. కాని, అదే ఒక రాగము కూర్చి “రామా…నన్ను కాపాడు..” అని గానము చేస్తే ఎంతో మధురంగా ఉంటుంది. గానములో అంత మాధుర్యం ఉంటున్నది.

కనుక, భగవంతుణ్ణి మనం పొందాలనుకుంటే, గానముచేతనే అది సాధ్యం. హృదయాన్ని అర్పితం చేసి, దీనితో ఒక రాగము కలిపి గానము చేస్తే భగవంతుడు తప్పక మీకు కనిపిస్తుంటాడు. మీరు ఎక్కడున్నప్పటికీ,

ఏ బజార్లో పోతున్నప్పటికీ తప్పక కనిపిస్తుంటాడు. మీకు తోచినరీతిగా భగవన్నామాన్ని గానం చేయండి. ఇదియే భగవంతుణ్ణి పొందటానికి సులభమైన మార్గం. కృష్ణావతారములో భక్తులు పొందినటువంటి ఆనందము మరి ఏ అవతారములో కూడను ఎవ్వరూ పొందలేదు. కనుక, మీరు కృష్ణావతారములో గోపికలు పొందినటువంటి అనుభూతిని జ్ఞప్తియందుంచుకొని మీరుకూడను మీకు తోచినవిధంగా గానముచేసి భగవంతుణ్ణి ఆనందపరచండి. అనేకమందికి అనేక విధములుగా దర్శనములిచ్చి, సందేహములు తీర్చి, తనలో లీనము గావించుకొన్నట్టి అవతారము, మృదుమధురమైన మాటలచేత అందరినీ సంతోషపెట్టినటువంటి అవతారము కృష్ణావతారము ఒక్కటే!

కృష్ణావతారములో లీనమైనట్లుగా భక్తులు మరి ఏ అవతారమునందుకూడను ఆవిధముగా లీనము కాలేదు. ఒక్క కృష్ణావతారమునందు మాత్రమే వేలకు వేలు భక్తులు భగవంతునితో చేరి ఏకమైపోయినారు. భగవంతునితో ఐక్యం కావాలంటే ఒక్క గానమే ప్రధానము. గానప్రియుడనే పదమునకు ఇదే సరియైన అర్థము. కృష్ణావతారమునందు కనుగొన్నటువంటి చర్యలు, మహిమలు, లీలలు, మరి ఏ అవతారము నందు కూడను కనిపించలేదు. అటువంటి ఆనందాన్ని మీరు పొందాలనుకున్నప్పుడు దైవమును ఏదో ఒక రాగముచేత కీర్తిస్తూ దానితో మీ హృదయరాగాన్ని ఏకం చేయండి. అట్టి రాగమే మీకు తెలియకుండా పోయినప్పుడు అదొక రోగంగా తయారౌతుంది. "కృష్ణా!" అనే ఒక్క నామమును గానము చేసినా చాలు. ఆవిధమైన గానముచేత మీరు దైవాన్ని పొందండి.

విద్యార్థులారా! మీరు ప్రతి రోజూ భజన చేస్తున్నారు. అందరూ భజనలో పాల్గొంటున్నారు. కాని, ఒక్కొక్కరిది ఒక్కొక్క రాగముగా పోతున్నది. నిజంగా ఆ రాగములో మీరు ఏకమైపోతే మీ హృదయంలో భగవంతుడు లీనమైపోతాడు. కనుక, భగవంతుణ్ణి మీ హృదయంలో లీనం చేసుకోవాలంటే, ఏదో మీకు తెలిసినటువంటి ఒక రాగాన్ని కల్పించుకొని గానము చేయవచ్చును. గానముకంటే మించినది మరొకటి లేదు. "నందుని ఇంట..గోపాలుడంట.. దీపాన కనిపించెనంట.." ఎంత ఆనందమునిస్తుంది ఈ పాట! కనుక మీ హృదయాన్ని ఉప్పొంగింపజేసే విధంగా భావరాగ తాళములతో భగవంతుణ్ణి కీర్తించండి. మీరు ఎన్ని భజనలు చేసినప్పటికీ, ఎన్ని పాటలు పాడినప్పటికీ దానిలో మృదుమధురమైన భావమును చేర్చినప్పుడే అది ఎంతో ఆనందాన్ని అందిస్తుంది.

(2004 సెప్టెంబరు 6వ తేదీ కృష్ణాష్టమి ఉదయం సాయికుల్వంత్ సభామండపములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)